# 4

# అపశ్రుతి

రేడియో జనగణమన పాడేసింది. విశాల కంగారుగా గడియారం కేసి చూసింది. లేచి పుస్తకం మంచంమీద పడేసి గది మధ్య నుంచుంది. ఓసారి నిద్రపోతోన్న పిల్లలకేసి చూసి, గుమ్మం కేసి తల తిప్పింది.

అబ్బ! ఏంవిటింత ఆలస్యం....? ఎప్పుడూ ఎక్కడా వుండని మనిషి ....ఏమైనా అయిందా?.... ఎక్కడికీ వెళ్తానని చెప్పలేదే!.... అనుకోని పనేదైనా వచ్చిపడిందా? ఏమో! ఏదో అయింది.

విసుగ్గా మళ్ళా పుస్తకం అందుకుంది చదువు సాగలేదు. ఆలోచనలు ఎక్కడెక్కడికో....ఏదైనా అయిందేమో! ... ఎవరో హఠాత్తుగా తలుపులు బాది... "తొరగా రండి....మూర్తిగారికి....దెబ్బలుతగిలాయి." అంటారేమో! లేకపోతే ఎందుకిం తాలస్యం ?

విశాల భీతితో కర్ర బొమ్మలా స్తంభించి కూచుంది.

గుండెలు దడదడ లాడటం మొదలుపెట్టాయి.

ఎవరో తలుపు కొడుతున్నారు. ఎగిరిపడింది. పరుగులా వెళ్ళి తలుపులు తీసింది. భర్తని చూస్తూ ధైర్యంగా ఆనందంగా నవ్వింది.

మూర్తి గబగబా లోపలకొచ్చాడు.... బట్టలు మార్చుకొంటూ "రేపు సూర్యం వస్తుంది మనింటికి–" అన్నాడు.

"సూర్యం ఎవరు ?"

"మర్చిపోయావా? మా మేనత్త కూతురు.... సూర్యాంబ.... సూరీ డంటారు....."

"ఆవి డెక్కడ కనిపించిందీ?"

"హాస్పిటల్లో కనిపిస్తే వాళ్ళ బసకి వెళ్ళి మాట్లాడుకుంటూ కూర్చున్నాం. వాళ్ళ పిన్నత్తగారి కేదో జబ్బు చేసిందట. తీసుకొచ్చి మకాం పెట్టారు. వారం పదిరోజులయిందట."

"అసలు మీరు ఆస్పత్రి కెందుకెళ్ళారూ?"

"మా ఆఫీసులో ఒకాయన హాస్పిటల్లో చేరాడు. చూద్దామని వెళ్ళాను. తీరా వచ్చేస్తోంటే సూర్యాంబ కనిపించింది...."

విశాల మరేం ప్రశ్నించలేదు.

మూర్తి భోజనానికి కూచున్నాడు.

"మీరు రావడం చాలా ఆలస్యం అయిందని భయం వేసింది నాకు." అంది విశాల అన్నం పెట్టి పక్కన కూచుంటూ.

మూర్తి ఏదో ఆలోచనల్లో వున్నాడు.

"సూర్యం చాలా చిక్కిపోయింది. చూడగానే పోల్చలేకపోయాను. తనే పలకరించింది-" అన్నాడు.

"ఏం? ఆవిడ కేమైందీ?"

"ఆ మధ్యెప్పుడో కడుపు పోయిందట. ఇప్పుడు వొంట్లో బాగానే వుందంది. ఏమో చూడ్డానికిమాత్రం ఏమీ బాగా లేదు. అసలదేమిటో బెంగపెట్టుకుని చిక్కిపోయిన దాన్లా వుంది. అలా వున్నా వేమని అడిగాను కూడాను. ఎలాగైనా దానికేదో దిగులుంది."

"దిగులా? ఎందుకూ?"

"ఏమో మరి! చెప్పలేదు."

విశాల వూరుకుంది. గిన్నెలన్నీ సర్ది మంచం దగ్గిరి కొచ్చింది.

మూర్తి చాలా నిరుత్సాహంగా, అలసటగా, మాట్లాడకుండా పడుకున్నాడు. విశాలకూడా దగ్గిరికి జరిగి పడుకుంది.

మూర్తి మరదలినిగురించి విశాలకి అప్పుడప్పుడూ చాలావిషయాలు చెప్పాడు. అందరిళ్ళలోనూ అనుకున్నట్టే సూరీడు పుట్టగానే అమ్మలక్కలంతా మూర్తికి పెళ్ళాం పుట్టిందనుకున్నారు. ఓ పదేళ్ళ కాలం అలాగే గడిచింది.

మూర్తి తండ్రీ-మేనత్త మొగుడూ కలిసి వుమ్మడి వ్యవసాయం పెట్టటంతో మొదలయ్యాయి స్పర్థలు. చౌకగా వస్తోందని అప్పులు తెచ్చి పొలం కొన్నారు. ఎవరి శక్తి కొద్దీ వారు సర్దుకుని బోరింగు వేయించారు. అనుకున్నంత ధారాళంగా నీరు పడలేదు. కొంత పొలం బీడు పెట్టుకోక తప్పలేదు. ఆ వాటాల పంపకాల్లో, ఖర్చుల లెక్కల్లో ఏదో గొడవలొచ్చాయి. ఇద్దరూ ఘర్షణ పడ్డారు. మధ్యవర్తుల్ని పెట్టుకుని పొలం వేరు చేసుకున్నారు. వియ్యం పొందాల్సిన వయస్సులో కయ్యం పెట్టుకున్నారు.

సూరీడూ మూర్తీ పెద్దవాళ్ళయ్యారు. మూర్తి చదువుకోసం వూరొదిలి పోయాడు. సూరీడు నిక్షేపంలా వంటింట్లో చేరింది.

సూరీడు నాన్న కూతురికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాడని తెలిసి కూడా మూర్తీ-వాళ్ళ నాన్న వూరుకున్నారు. "ఆడపిల్లగల వాడివి పెళ్ళి పిల్లని చేసుకోమని అడుగు. నీ తప్పుండదు" అని మధ్యవర్తులు చెప్పిన సలహాలన్నీ తల అడ్డంగా తిప్పేసి తోసేశాడు సూరీడు తండ్రి. అసలు సూరీడూ, మూర్తీ ఎప్పుడూ ముఖంమీద ముఖం పెట్టి చూసుకోలేదు; మాటాడుకోలేదు. చిన్నప్పట్నుంచీ ఎడం ఎడంగానే తిరిగారు. ఒకళ్ళంటే ఒకళ్ళకి వల్లమాలిన సిగ్గనుకున్నారు అందరూను.

"పెద్దవాళ్ళేదే కోపాలు పెట్టుకు చస్తున్నారు. పోనీ మీ బావని నువ్వడగరాదుటే?-ఏమంటాడో? చిన్నప్పట్నుంచీ అనుకున్న సంబంధం.... తప్పిపోతే ఏం బావుంటుందీ?" అన్నారెవరో సూరీడు దగ్గిర. ఆ పిల్ల తాచు పాములా లేచి-"ఎందుకు బావుండదూ? భేషుగ్గా వుంటుంది. అంతోటి మహా

రాజు దగ్గిరికి నన్ను దేవిరిస్తూ పొమ్మంటావా? మా నాన్న నాకు పెళ్ళి చెయ్యలేదా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

తర్వాత మరదలి ప్రశ్నలు మూర్తివరకూ వెళ్ళాయి. వెటకారంగా, ఉక్రోషంగా మండిపోతూ—"మహారాజే దొరుకుతాళ్ళే. వాళ్ళ నాన్న తేలేక పోవటం ఏమిటి? ఎవడి నెత్తిమీదో చెయ్యి పెట్టేస్తాడు. నా కాళ్లముందు లక్షలు గుమ్మరించినా నేను దాన్ని చేసుకోను" అన్నాడు. కొంత కసి తీరింది. సూరీడే కావాలనీ, సూరీడు లేకపోతే చచ్చిపోవాలనీ మూర్తి కెప్పుడూ అనిపించలేదు. అందుకే సూరీడు పెళ్లవుతోంటే మూర్తి హాయిగా ఫ్రెండ్సుతో పేకాడుకుంటూ గడిపేశాడు.

అదంతా మూర్తే చెప్పాడు విశాలకి.

"పోనీ ఆ పిల్లకి పెళ్ళయిపోయాక మీ కెప్పుడన్నా విచారం వేసిందా?" అంది విశాల.

"ఛా! నా కెందుకూ విచారం?"

"ఎందుకేవిటి? బొత్తిగా మేనత్త కూతురు. చిన్నప్పట్నించీ అను కున్న సంబంధం—పోనీ సూరీడు మిమ్మల్నే పెళ్లి చేసుకోవాలని వుందని ఉత్తరం రాస్తే....నిజం చెప్పాలి. ఏం చేసేవారు?"

"ఏమో! ఏం చేసేవాణ్ణో!"

"ఎందుకో అంత దాపరికం?"

"దాపరికం కాదు. ఒకవేళ సూరీడు అలా ఉత్తరం రాస్తే మా నాన్నకి చూపించి, దాన్నే చేసుకుంటానని చెప్పేసేవాణ్ణేమో! అయినా నీకూ నాకూ రాసిపెట్టివుంటే, దానికి నాకు ఎలా అవుతుంది చెప్పూ!"

"బావుంది వేదాంతం!"

సూరీడు మీద మొదలు పెట్టిన సంభాషణ అలా సాగేది.

సూరీడు గురించి ఎన్నిసార్లు విన్నా విశాలకి బాగానే వుంటుంది. అన్నీ సవ్యంగా జరిగితే తన స్థానంలో సూరీడే వుండేది మరి. మూర్తి అన్నట్టు ఎవ రెవరికి రాసి పెట్టివుందో ఎలా తెలుస్తుంది?

ఆ రాతలాంటి దేదో లేకపోతే మూర్తి విశాల తండ్రికి పరిచయు మయ్యేవాడు కాడేమో! బి.ఏ. పాసై ఇంకా చదవటానికి డబ్బులేక వుద్యోగాలకోసం తిరుగుతూ.... తిరుగుతూ.... ఎవరో యిచ్చిన సిఫార్సు కాగితం తీసుకుని పుట్టెడు జబ్బు పడ్డవాడిలా-నిరాశతో-విరక్తితో.... మాసిన బట్టలతో-పెరిగిన గడ్డంతో.... విశాల తండ్రి దగ్గిరి కొచ్చాడు మూర్తి ... పదేళ్ళ క్రిందట.

ఆ మూర్తికీ ఈ మూర్తికి ఎంత అంతరం!

విశాల తండ్రి డిప్యూటీ కలెక్టరు. మూర్తికి వుద్యోగం వేయించాడు. ఓ ఏడాది ఆలోచించి విశాల నిచ్చి పెళ్లి చేశాడు. తర్వాత మూర్తి మామగారి ప్రోత్సాహంతో ఎమ్.ఎ. చదివి పాసయ్యాడు. మూర్తి వుద్యోగం మారింది. హోదా పెరిగింది. మామగారి వాత్సల్యంతో విశాల జతతో సంవత్సరాలు క్షణాల్లా దొర్లిస్తున్నాడు.

ఎవరి సంసారాల్లో వాళ్లు మునిగి తేలుతున్న ఈ సమయంలో, పదేళ్ల తర్వాత, సూరీడు మూర్తి యింటికి వస్తాననటం మూర్తికి చాలా గర్వం కలిగించింది.

సూర్యాంబని చూడాలని విశాలకి కూడా చాలా కుతూహలం కలిగింది.

* * *

సూర్యాంబ పాలిపోయిన తెలుపుతో సన్నగా పొడుగ్గా తీగలావుంది. మంచి కళ్లు, కుదురైన మొహం, జుట్టు ముడివేసుకుంది లేతరంగు చీరలో కొంచెం పెద్దదానిలా కన్పిస్తోంది.

విశాలని చూడగానే కొంచెం నవ్వింది. విశాల కూడా నవ్వుతూ ఆహ్వానించింది.

మూర్తి సూర్యాంబని చూసి నవ్వుతూ—విశాలని చూపిస్తూ—

"ఎవరో తెలుసా? చెప్పమంటావా?" అన్నాడు.

"తెలీదు. చెప్పు" అంది సూర్యాంబ తనూ నవ్వుతూ.

"రండి" అంది విశాల కలగజేసుకుని.

"మా బావ యిప్పటికైనా చూపించాడు మిమ్మల్ని, యెన్నాళ్ళ నుంచో చూడాలని వుంది నాకు" అంటూ నడిచింది సూర్యాంబ.

"మిమ్మల్ని కూడా నే నెప్పుడూ చూడలేదు" అంది విశాల అభిమానంగా.

ముగ్గురూ లోపలికి వెళ్లారు. సూర్యాంబ కళ్లు అటూ ఇటూ తిప్పి గదులూ, గోడలూ, సామానూ, అంగుళం అంగుళం పరిశీలిస్తోనే వుంది.

సూర్యాంబ కళ్లు యెటు తిప్పితే అటు చూపులు మారుస్తున్నాడు మూర్తి.

ఇల్లు సూర్యాంబ కెంతో నచ్చినట్టుకనబడింది.

గవర్నమెంటు వారిచ్చిన బంగళా అది. అధునాతనంగా అగ్గిపెట్టెలా అందంగా వుంది. గదులు చిన్నవే అయినా అన్ని సదుపాయాలకూ విడి విడిగా వున్నాయి. ఏ గదికి తగ్గ సామా నా గదిలో అందంగా, పొందికగా సరివున్నాయి. గుమ్మాలకూ, కిటికీలకూ చక్కటి తెరలు, పంకాలు వంటింట్లోనూ, భోజనాల దగ్గిర, బాత్‌రూమ్‌లోనూ, వాకిట్లోనూ నీళ్లపంపులు. వాకిలి చాలా భాగం గచ్చు. ఇంటి చుట్టూ ఏవేవో మొక్కలు, ఒకళ్లతో సంబంధం లేకుండా చుటూ ప్రహరీ. ఇల్లంతా చూస్తూ సూర్యాంబ బాగా తెల్లబోయింది. బావ కేదో మంచి ఉద్యోగం అని తెలుసు గానీ ఇంత అందమైన యింట్లో, యింత సుఖంగా, యింత హాయిగా వుంటున్నాడని తెలీదు.

"అబ్బ! యెంతో బావుంది యిల్లు, యిలాంటి యింట్లో కాపరం చేస్తే ఆడదానికెంత సుఖమో!" అనేసింది అటూ ఇటూ చూస్తూ.

మూర్తి మొహం గర్వంలాంటి భావంతో వెలిగింది.

విశాల ట్రేలో కాఫీ కప్పులు పెట్టి తెచ్చి, "తీసుకోండి" అంటూ సూర్యాంబ కో కప్పు అందించింది.

సూర్యాంబ నొచ్చుకుంటోన్నట్టు, "ఇప్పుడేం కాఫీ? మీ రనవన రంగా శ్రమపడ్డారు. అయ్యో నేను చూడనేలేదు. లేకపోతే పెట్టనిచ్చేదాన్ని కాదు" అంది కప్పు అందుకుంటూ.

"అబ్బే! శ్రమేమిటండీ?....కొంచెం కాఫీ తాగితే బావుంటుంది." అంది విశాల క్లుప్తంగా.

మూర్తి సూర్యాంబని చూస్తూ- "మా యింట్లో గ్యాస్ స్టవ్ వుందిలే ఏమీ శ్రమలేకుండా క్షణాల్లో అయిపోతాయన్నీ. చూస్తావా?.... పద," అంటూ వంటగదికేసి దారి చూపించాడు.

సూర్యాంబ కుతూహలంగా వెళ్ళింది విశాలతోపాటు.

సూర్యం మొహంనిండా ఆశ్చర్యం వురకలెత్తటం కనిపించింది మూర్తికి. వంటిల్లు విశాలంగా వుంది. గోడలకి ఎత్తుగా బల్లలున్నాయి. వాటినిండా తళతళలాడే డబ్బాలు జాడీలూ పేర్చి వున్నాయి. అలమారు నిండా స్టీలు పళ్ళాలూ, గరిట్లూ, గిన్నెలూ, గ్లాసులూ, చెంచాలూ.... సంసారానికెన్ని వస్తువులు అవసరమో.... అన్నీ....అవన్నీ యెక్కువ భాగం విశాల పుట్టింటినించి తెచ్చుకున్నవే.

సూర్యాంబ వంటిల్లంతా గుచ్చి గుచ్చి చూసింది. "ఈ సామానంతా యెన్ని వేలు పోసికొన్నావు?" అంది మూర్తికేసి చూసి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

మూర్తి నవ్వి వూరుకున్నాడు.

విశాల సూర్యాంబ చేతిలో కప్పు అందుకుని పంపుదగ్గర కడిగి టవల్‌తో తుడిచి అలమారులో సర్దేసింది. "కాస్సేపు గదిలో కూచుందాం పదండి." అంది.

సూర్యాంబ ఇల్లంతా చూసి చూసి మతిపోయిన దానిలా సోఫాలో సర్దుకూచుంది. ఏదో పత్రిక అందుకుని తలకిందులుగా తిరిగేయటం మొదలెట్టింది.

మూర్తి నవ్వి– "ఎందుకలా పరాగ్గా వున్నావే?....ఎలా వుంది మా యిల్లు?" అన్నాడు మరదలి మొహంలోకి గుచ్చి చూస్తూ.

అలా అడగటం - విశాలకి నచ్చలేదు. "బావుంది మీ రడగటం; ఎవరైతే మాత్రం ఏమంటారు? మర్యాదకోసమైనా బావుందంటారు." అంది.

సూర్యాంబ అడ్డుపడి– "మాబావకీ నాకూ మర్యాదేవిఁటండీ. నిజంగా మీ యిల్లేదో.... స్వర్గం అంటారే అలావుంది. నేను చెప్పటం యెందుకు? మా యిల్లోసారి చూస్తే మీయిల్లెలా వుందో మీకే తెలుస్తుంది." అంది.

"ఎలా వుంటుందేవిటి మీ యిల్లు?" కుతూహలం ప్రదర్శించాడు మూర్తి.

సూర్యాంబ మొహంలో ఏమిటో మార్పు వచ్చేసింది– ఒక్క క్షణం వుదాసీనంగా వూరుకుంది. "అద్దెకొంప యెలా వుంటుంది? వంటిల్లు గాక ఒక్క గది. చిన్న వరండా. మైలున్నర దూరంనుంచి నూతినీళ్ళు మోసుకోవాలి. ఉమ్మడి దొడ్డి. ఓ మరుగులేదు. నాశనం లేదు. చుట్టూ మురి క్కాలవ. ఈగలంతేసి దోమలు. మండు వేసంకాలమైనా, పిండారబోసినట్టు వెన్నెల కాస్తోన్నా, కాస్త పెరట్లో మంచం వేసుక్కూచునే దారిలేదు. వంట చేస్తోన్నంతసేపూ పొగతో చస్తాను. అదేం కొంపో పొగపోయే దారేలేదు. నెల నెలా పాతిక రూపాయలు పోస్తున్నాం. ఏం తక్కువా?"

"అద్దె తీసుకుంటారేగాని, యింట్లో వుండేవాళ్ళ సుఖం చూడరండీ! కొన్ని కొన్ని యిళ్ళు బాగానే వుంటాయిగానీ, కొన్ని వాటాల్లో అవస్తే మరి–" అంది విశాల.

"అవస్తని నెమ్మదిగా అంటారా? మీరైతే ఒక్కక్షణం వూపిరి పీల్చుకోలేరు మా యింట్లో."

"పోనీ యింకెక్కడైనా మంచివాటా దొరుకుతుందేమో చూడలేక పోయారా?"

"ఇక నేను బయల్దేరాలి ఇళ్ళకోసం. ఎన్నిసార్లు చెప్పినా వింటేనా? ఎప్పుడూ వూరుమీదే బలాదూరు. రాత్రిపూట ఆ నాలుగైదు గంటలూ నిద్రలోనే పోతుంది. ఇల్లు యెలా తగలబడితే మాత్రం మొగవాళ్ళకేం పడుతుందీ?"

"ఎదరగా చెట్టంత మగవాణ్ణి పెట్టుకుని అలా -అనేస్తున్నావేమిటి-" అన్నాడు నవ్వి మూర్తి.

సూర్యాంబ మాటలు విశాలకి బాగున్నట్టులేవు. సూర్యాంబ అన్నాలకు లేచేవరకూ బావగారింటి సొగసుల గురించీ, తన యింటి లొసుగుల గురించే మాట్లాడింది.

హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి- "పిల్లలేరీ? నేను వాళ్ళ మాట మర్చేపోయాను. బళ్ళో కెళ్ళారా?.... ఎప్పుడొస్తారు" అంది గబగబా.

"మధ్యాహ్నంపూట రారు. కాన్వెంటు చాలాదూరం. కేరియర్ తీసుకుపోతారు-" అంది విశాల.

"సాయంత్రం ఎప్పటికొస్తారు? నేను చూస్తానో లేదో?"

"బావుంది. అంత కంగారుపడిపోతున్నారేవిటి? నాలుగు రోజులుండి వెళ్దురుగాని."

"నాలుగు రోజులే ఇంకా నయం. మా పిన్నత్తగారు మెళ్ళో డప్పు కట్టుకుని మరీ చాటింపేస్తుంది, అర్థాంతరం చేశానని. అయినా ఆవిడకింకా బాగాలేదు. పండుకోలేదు. అన్నట్టు మీ పిల్లలపేర్లేమిటి? మీపోలికేనా?....వాళ్ళ బాబు పోలిక లొచ్చాయా?"

"అబ్బాయి పేరు రవీంద్ర. పాప పేరు సుజాత." అంది విశాల పోలికల మాట ఎత్తకుండా.

"పిల్లలపేర్లే ఎంతో ముద్దుగా ఉన్నాయి. అవును మరి కాలానికి తగ్గట్టుండాలిగానీ మా వాళ్ళకికూడా యిలా ఏవో మంచిపేర్లు పెడదామంటే మా ఆయన ఛస్తే ఒప్పుకోలేదు. వాళ్ళ తాతపేరూ— ముత్తాత పేరూ - ముసలమ్మ పేరూ-అన్నీ జతచేసి పాతచింతకాయ పచ్చడిపేర్లు పెట్టేస్తేగాని ఆయనకి తృప్తి కలగలేదు."

"ఇంతకీ నీ పిల్లల పేరేమిటో చెప్పు!" అన్నాడు మూర్తి.

"పెద్దాడి పేరు వీరవెంకట సత్యనారాయణ. పిల్లపేరు కనకమాలక్ష్మి. చిన్నాడిపేరు సత్యశివ సాంబమూర్తి. నా ఆరోగ్యం తగలడింది గానీ లేకపోతే, ఇంకో ముగ్గురికో నలుగురికో పేర్లు వెతుక్కోవలిసొచ్చేది."....చిన్నప్పుడు బొత్తిగా మాటాడుకోని ఈ బావమరదళ్ళు ఇంత కాలానికి, యింత చనువుగా ఎలా మాటాడుకుంటున్నారో ఆశ్చర్యం వేసింది విశాలకు.

"నిజంగానే నువ్వు చాలా పాడైపోయావ్. బాగా చిక్కిపోయావ్. ఆ వున్నవాళ్ళు ముగ్గురూ చాలరూ?" అన్నాడు మూర్తి.

"ముగ్గురనగా ఎంత?....మా కున్న లక్షలన్నీ వృధాగా పోవూ? ఏటేటా బళ్ళతో వచ్చి పడుతోంది ధనం. మరి నేను పిల్లల్ని కనకపోతే ఎవడు తిననూ?...."

"నీకు తెలియకుండా మీ ఆయన బ్యాంకులో దాస్తున్నాడేమో డబ్బు" అన్నాడు మూర్తి.

"భోంచేద్దాం రండి. పన్నెండు దాటింది" అంది విశాల చటుక్కున లేచి. వెళ్ళి వడ్డన కుపక్రమించింది.

మూర్తి ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి భోజనాలబల్ల అంచున పెట్టాడు. తీగలు సాగినట్టు హిందీ పాటలేవో వస్తున్నాయి.

సూర్యాంబ వచ్చి మూర్తి కెదురుగా ఓ కుర్చీలో కూచుంది. విశాల గరిట్లతో అన్నీ చకచకా వడ్డించింది.

"నన్నేమైనా సాయం చెయ్యమంటారా?" అంది సూర్యాంబ గబుక్కున గుర్తొచ్చినట్టు.

విశాల నవ్వి—"ఏం చేస్తారు? అన్నీ యిక్కడే వున్నాయి. నా వంటలు నచ్చినా, నచ్చకపోయినా కడుపునిండా తినెయ్యండి" అంది.

"అదే పెద్ద సాయం. గిన్నెలు ఖాళీ అయితే గబగబా కడిగి సర్దుకుంటుంది" అన్నాడు మూర్తి.

అన్నీ వడ్డించి, సూర్యాంబ అన్నం నిండా నెయ్యిపోంచి విశాల కూడా కూచుంది.

మూర్తి గబగబా నాలుగు ముద్దలు తిని తలెత్తాడు—"టేబుల్ మీద తినటం చాలా సుఖంగా వుంటుంది కదూ?...హాయిగా, దర్జాగా వుంటుంది; పీటమీద కూచుని తినాలంటే నాలాంటి వాడికి నడ్డి వంగదు" అన్నాడు మరదలిని చూస్తూ.

మూర్తి మాటలు విశాలకి చాలా అతిశయంగా తోచాయి. ఈయన ఎందుకిలా మాట్లాడుతున్నారు?....మాట మాటలోనూ-"ఇదిగో! మేమింత ఆనందంగా వున్నాం. మా యిల్లింత అందంగా వుంది. మేమింత గొప్పగా సుఖపడుతున్నాం చూశావా?" అన్న గర్వం ప్రతిధ్వనిస్తోంది. ఎదటి వ్యక్తి నెందుకలా వెక్కిరించటం?....

విశాల సూర్యాంబ కేసి చూసింది.

సూర్యాంబ మొహం మాసినట్టు కళా విహీనంగా వుంది.

మూర్తి మాటలకు నొచ్చుకుందేమో! "సుఖంగా వున్నవన్నీ అంద రికీ ఎలా వస్తాయి?" అంది.

"దానికేం లెండి. ఎవరి పరిస్థితులు వాళ్ళవి" అంది విశాల మధ్య వర్తిగా.

సూర్యాంబ మొహం తేటపడలేదు. మాట్లాడకుండా కూచుంది.

"అలా వున్నావేం?" అన్నాడు మూర్తి కాస్సేపటికి.

"ఎలా వున్నాను?"

"ఏమిటో దిగులుగా వున్నావు."

"దిగులే కదా?....కొత్త కాదులే."

"ఏం ఎందు కేమిటి అంత దిగులు?"

"మీ పిల్లలేం చదువుతున్నారు?" అంది విశాల కలగజేసుకుని.

సూర్యాంబ విశాలకేసి చూసింది—"పెద్దాడు మూడో క్లాసు. పిల్ల ఒకటి. ఏం చదువుల్లెండి. బళ్ళలో ఒక్క అక్షరమ్ముక్క చెప్పటంలేదు.

పూట పూటా వెళ్ళటం రావటం దండగ. ఇంటి దగ్గిర తల్లో దండ్రో నాలుగు ముక్కలు చెప్పుకోవాలి. మా పెద్దాడు మూడో క్లాసు ఫెయిలయ్యి మళ్ళా చదువుతున్నాడు. ఈ ఏడేం చేస్తాడో?"

"మీరు కొంచెం శ్రద్ధ పట్టి చెప్పరాదూ?"

"చెప్తోనే వుంటాను. అయినా నాకు ఖాళీ ఎక్కడనండీ?....ఇంటెడు చాకిరీ."

"పోనీ వాళ్ళ నాన్నగారు...."

"అంతదృష్టమా! పిల్లల చదువు సంధ్యలు కూడా పట్టించుకుంటే ఆయన చేసే రాచకార్యాలన్నీ ఏం కాను?"

"ఇదిగో సూర్యం! నువ్వు మాటి మాటికీ నీ మొగుణ్ణి దుయ్యబడు తున్నావు. పాపం ఆఫీసులో కష్టపడి వచ్చేవాడు పిల్లలకి చదువూ గిదువూ ఎలా చూస్తాడు చెప్పు. అసలు పిల్లల విషయాలన్నీ తల్లి చూసుకోవాలి" అన్నాడు మూర్తి.

"తల్లి ఎంత చూసుకున్నా తండ్రి కూడా కొంత చూసుకోవాలి. పిల్లల మాటెందుకూ?.... పెళ్ళానికే దిక్కూ దివాణంలేదు. పుట్టెడు తెగులొచ్చి మూలుగుతున్నా—'తిన్నావా?వున్నావా?' అన్నమాట రాదు."

"భలే మాట్లాడుతున్నారే మీరు" అంది విశాల హాస్యంలోకి దించాలని.

"అబద్ధం కాదండీ! మా ఆయనకి యిల్లూ-ఇల్లాలూ-పిల్లలూ-పీచూ....ఏం అక్కర్లేదు. ఇవన్నీ చూసుకుంటూ కూచుంటే పేకాటెవ రాడతారు?"

విశాల విస్తుపోయింది. సూర్యాంబకేసి విచిత్రంగా చూసింది.

"పేకాడితే మాత్రం యిల్లూ వాకిలీ చూసుకోరేమిటి సూర్యం?" అన్నాడు మూర్తి.

"నీకు తెలీదులావుంది. పేకాటకి లోటొస్తే నిక్షేపంలా పెళ్ళాన్ని అమ్మెయ్యగలరు. ఏమనుకున్నావో."

కథా నిలయం
242
శ్రీకాకుళం



"నేనూ ఆడుతూంటాను-అప్పుడప్పుడూ."

"నీకేం? సంపాదిస్తున్నావు. పేకాటాడినా, తందనా లాడినా ఫర్వా లేదు. అంతేగానీ మాలాంటివాళ్ళకి...."

"మరి నువ్వు పేకాడొద్దని చెప్పలేకపోయావా?"

"నువ్వు వింటున్నావేమోగానీ, పెళ్ళాంచెప్తే మొగుడు వింటాడా!"

"ఒక మంచి మాట యెవరైనా చెప్పచ్చు. యెవరైనా వినచ్చు."

"కాదులే. మాఆయనకి మాత్రం నామాట వినటం నామోషీ."

సూర్యాంబ ధోరణి విశాలకి చాలా యెబ్బెట్టుగా వుంది.

సూర్యాంబ పళ్ళెంలో అన్నం వడ్డిస్తూ- "మీరు యెక్కువగా కూరగాయలు తింటారా? పప్పు లవీ తింటారా?" అంది.

సూర్యాంబ ధోరణి పాత ఫక్కీలోనేవుంది—"ఏదో ఒకటి, ఆత్మారాముడు చల్లబడటానికి, ఏది తెచ్చుకోగలిగితే అది."

"సూరీ దేవిటో విరక్తిలో పడిపోతోంది." అన్నాడు మూర్తి నవ్వుతూ.

మూర్తికి నవ్వు యెలా వస్తోందో విశాలకి అర్థం కాలేదు.

మూర్తి యెందుకు నవ్వుతున్నాడో సూర్యాంబ కూడా ఆలోచించలేదు.

భోజనాలయ్యాయి.

విశాల వక్కపొడి అందిస్తూ—"మీరు కాస్సేపు పడుకోండి" అంది.

"ఈ కాస్సేపూ పడకేవిటి? మాట్లాడుకుంటూ కూచుందాం" అంది సూర్యాంబ.

ముగ్గురూ పడగ్గదిలో కూచున్నారు.

విశాల కాస్సేపు ఆల్బమ్ తీసి ఫోటో లవీ చూపించింది. అన్నిటినీ మొహం వాచిన దానిలా చూసింది సూర్యాంబ. ఆల్బమ్ ఆవిడ ఒళ్ళో వదిలేసి కళ్ళు కూరుకు వస్తోంటే పడుకుని నిద్రపోయింది విశాల.

లేచేవరకూ బావా మరదళ్ళిద్దరూ మాట్లాడుకుంటూనే వున్నారు. "సరి. మా మాటలతో మీ నిద్ర చెడగొట్టాం." అంది సూర్యాంబ.

"అబ్బే! నాకే మెలుకు వొచ్చేసింది" అంటూ లేచింది విశాల. మొహం కడుక్కొని వంటింట్లో కెళ్ళి టిఫిన్‌చేసే ప్రయత్నంలో పడింది. కాఫీలయ్యాక విశాల సాయంత్రానికి వంట ప్రయత్నాలు చెయ్యబోతోంటె వారించింది సూర్యాంబ. మీ యింట్లో వుండటానికేం స్వర్గంలావుంది. మొగుణ్ణీ పిల్లల్నీ వొదిలేసి వుండిపొమ్మన్నా వుండిపోతాను. కానీ అవతలి ఆవిణ్ణి వొదిలేసి ఏం బావుంటుంది చెప్పండి!" అంది.

"పోనీలే. మరోసారెప్పుడైనా వీలుచూసుకుని మీ ఆయన్నీ, పిల్లల్నీ కూడా తీసుకురా. కొన్నాళ్ళు వుండి వెళ్ళుదుగాని" అన్నాడు మూర్తి.

"అంత మాటన్నావు. అదే చాలు. ఇంతకీ మీరెప్పుడు మా యింటి కొస్తారు? ...వచ్చినా ఒక్కపూట భరించగలమా మేము?"

"ఏం? ఏనుగుల తిండి తింటామా?"

"దేవతల తిండి తింటారు. మా బ్రతుకంతా కలిపినా మీ తాంబూలం ఖర్చు వుండదు.

సూర్యాంబ కేమైనా మతిపోయిం దేమోనని విశాల వెర్రి దానిలా చూసింది.

సూర్యాంబ చెప్పే ప్రతి కబురూ మూర్తి నవ్వుతూ వింటున్నాడు.

సూర్యాంబ మొహం కడుక్కోవటానికి బాత్‌రూమ్‌లో కెళ్ళింది. మూర్తి విశాల దగ్గిరికి వంటింట్లో కొచ్చాడు

"చూశావా? మనిషి యెంత మారిందో!" అన్నాడు.

విశాల కేమనాలో తోచలేదు.

"మరి సూర్యాని కేమిద్దాం?" అన్నాడు మళ్ళీ.

"మీరే చెప్పండి. ఏమిస్తే బావుంటుంది?"

"మొన్న నువ్వు కొనుక్కున్న ధర్మవరం పట్టుచీర కట్టలేదుగా, బొట్టుపెట్టి ఆ చీర యివ్వరాదూ?.... మళ్ళా కొనుక్కుందువుగాని—"

విశాలకి నచ్చలేదు- "ఆవిడకు చీర యిచ్చేకన్నా డబ్బు యిస్తే యెందుకైనా పనికొస్తుంది."

"అయితే సరే! నువ్వే యిస్తే బావుంటుంది."

సూర్యాంబ తల దువ్వుకుని - బొట్టు పెట్టుకుని - బయటికొచ్చింది. వెళ్ళటం యిష్టం లేనిదానిలా బిక్కమొహంవేసి నుంచుంది. విశాల మనస్సంతా కరిగిపోయింది. సూర్యాంబ మొహాన్న బొట్టుపెట్టి - వంద రూపాయలనోటు జాకెట్టు గుడ్డలో పెట్టి చేతిలో పెడుతూ - "మీరు మన సులో దిగుళ్ళేమీ పెట్టుకోకండి. ఎప్పుడైనా ఏమైనా అవసరమైతే మీ బావగారికో ఉత్తరం రాయండి. మీ తోడబుట్టినవారే అనుకోండి. వస్తూ పోతూ వుండండి." అంది. పుట్టెడు పెద్దరికంతో - అంతకన్నా యెక్కువ వాత్సల్యంతో.

సూర్యాంబ వెనుక గేటువరకూ వెళ్ళి సాగనంపింది.

మూర్తి మరదలిని దిగబెట్టటానికి వెంట వెళ్లాడు.

విశాల వెళ్తోన్న వారిద్దర్నీ చూసి చూసి, గేటు మూసి ఆలోచిస్తూ వెనక్కి వచ్చింది.

సూర్యాంబ వస్తోందంటే ఇలా అవుతుందనుకోలేదు. చాలా ఆశ్చ ర్యంగా వుంది. విశాలకి.

"మా నాన్న నాకు పెళ్ళే చెయ్యలేదా? అంతోటి మహారాజు దగ్గిరికీ నన్ను దేవిరిస్తూ పొమ్మంటావా?" అని పౌరుషపడిన సూర్యాంబ ఈవిడే నంటే నమ్మశక్యంగాలేదు. ఆ అభిమానమంతా ఏ గంగలో కలిసి పోయింది?....

సంసారం అంటే యిద్దరికి సంబంధించింది కాబట్టి ఆ యిద్దరిమధ్యా ఏవో గొడవలుంటూనే వుంటాయి. ఒక్కొక్కరి జీవితం మరీ కష్టమాయి

ష్టంగా వుంటుంది. పోనీ సూర్యాంబ మాటలన్నీ నిజమైనవే అనుకోవచ్చు. మొగుడు యిల్లూ వాకిలీ పట్టనివాడే అవ్వచ్చు. కూటికీ గుడ్డకీ అన్నిటికీ మొహం వాచి వుండచ్చు. అదంతా నిజం అయితే మాత్రం మనస్సంతా విప్పి ఏ ప్రాణస్నేహితురాలికో చెప్పుకోవాలి. అలాంటివాళ్లు లేకపోతే ధీ ఇరుగమ్మకో, పొరుగమ్మకో చెప్పుకున్నా తప్పులేదు. అంతేగానీ.... ఇన్నేళ్ళ తర్వాత చుట్టం చూపుగా బావగారింటికొచ్చి .... అదీ పంతాలతో పెళ్ళి మానుకున్న బావదగ్గిరా. ముక్కూ మొహం యెరగని తన దగ్గిరా ఇంటి గొడవలన్నీ వెళ్ళబెట్టుకుంటే ఏం వొరిగింది? బావగారు జాలైనా పడలేదే!—"చూశావా? నన్నే చేసుకోమని ప్రాధేయపడితే నీకెంత భావుండును! నా విలువ గుర్తించనందుకే నువ్విన్ని కష్టాలుపడుతున్నావు." అన్నట్టు ప్రవర్తించారు. అడుగడుగునా ఆయన ప్రవర్తనా, మాటతీరూ తనకి తెలుస్తోనే వుంది. సూర్యాంబ గుర్తించలేదా? పిచ్చిగానీ ఆవిడకూడా బావగార్ని పెళ్ళి చేసుకోనందుకు పశ్చాత్తాపడుతోన్నట్టే కన్పించింది. లేక పోతే మొగుణ్ణి గురించి ఈ బావదగ్గిర అంత తేలిగ్గా మాట్లాడదు. అసలు సూర్యాంబ కిలాంటి పశ్చాత్తాపం యెందుక్కలగాలి? ఒకసారి తను వద్దనుకున్న మనిషి, తనని వద్దన్న మనిషి ఎంత గొప్పవాడైతే మాత్రం యెపడిక్కావాలి?

* * *

కానీ సూర్యాంబ అలా అనుకోలేదు. "ఎందుకొచ్చిన పౌరుషాలు? బతుకంతా నాశనమయ్యాకకూడా బుద్ధిలేకపోతే యింకెప్పుడొస్తుంది?" అనుకుంది. ఆ యింట్లో అడుగుపెట్టగానే, తన బ్రతుకు సర్వనాశనం అయిపో యిందనిపించిందా క్షణంలో మూర్తినే చేసుకుంటే బ్రతుకెలా సాగేదో నన్న శంకకూడా రాలేదు.

తిరిగి వెళ్తోన్నప్పుడు మూర్తితో స్పష్టంగానే అనేసింది. "మీ యిల్లూ వాకిలీ అన్నీ చూసేసరికి నాకెంత ముచ్చట వేసిందనుకున్నావ్? బ్రతికితే అలా బ్రతకాలి. లేకపోతే చావాలి. ఎందుకొచ్చిన కాపరాలు?"

మూర్తి వెక్కిరింపుధోరణి వొదిలేసి అభిమానంగా అన్నాడు. "నువ్వలా బాధపడుకు సూర్యం! ఉన్నంతలో ఆనందంగా వుండాలి. మీ యిద్దరిమధ్యా ఎలాంటి చికాకులూ లేకపోతే చాలు. ఎంత పేదరికాన్నయినా సంతోషంగా భరించవచ్చు."

సూర్యాంబ వెటకారంగా నవ్వింది; పేదరికం భరించటం కబుర్లు చెప్పుకున్నంత తేలికకాదు. మొగుడూ పెళ్ళాలు ముచ్చట్లాడుకుంటే కడుపు నిండిపోతుందా? నువ్వెన్ని చెప్పు. నాకు బతకటం అంటే రోత పుడుతోంది. ఛస్తే పీడా పోతుంది."

"చాల్లే! ఏమిటా మాటలు?" చిరాకుపడి మందలించాడు మూర్తి. "అస్తమానం చావు చావుఅంటావేమిటి? వెనకాల ముగ్గురు పిల్లలున్నారు వాళ్ళనేం చేస్తావు?"

"వాళ్ళే వుంటారు. తల్లి చచ్చినవాళ్ళెంతమంది బతకటంలేదు?.... పోనీ నువ్వు చేరదీసి యింట్లో పెట్టుకో! ఏం నీకా తాహతు లేదూ?"

సూర్యాంబ అడుగడుగునా తనని గొప్పచేస్తూ మాట్లాడటంమూర్తికి తృప్తిగానే వుంది. "నేను చేరదీస్తే మీ ఆయన వూరుకోవద్దూ?"

"పెళ్ళాం బిడ్డ లెప్పుడు విరగడౌతారా అని చూస్తున్నా రాయన." సూర్యాంబ కళ్ళలోంచి జలజలా కన్నీళ్ళు రాలిపడ్డాయి.

సూర్యాంబ మాటలేవీ మూర్తి కంతగా నచ్చలేదు. కానీ సూర్యాంబ అలా మాట్లాడటానికి చాలా సమంజసమైన కారణం వుందని అతని అభిప్రాయం.

"ఛ! వూరుకో సూర్యం! ఏమిటిది?" అన్నాడు ఓదార్పుగా.

"నా కేవిటో పిచ్చెత్తుతోన్నట్టుంది." అంది సూర్యాంబ కళ్ళు తుడుచుకుంటూ. నిజంగా సూర్యాంబ మాట్లాడిన మాట లన్నిటిలోకీ నూటికి నూరుపాళ్ళు నిజమైన మాట అదొక్కటే.

ఆరోగ్యంతో కలకల్లాడుతూ సూటూబూటూ వేసుకుని దొర బాబులా వున్న మూర్తిని, మహారాణీలా అందంగా గంభీరంగా వున్న

మూర్తి పెళ్ళాన్ని, స్వర్గంలో దేవేంద్ర భవనంలా కన్పించిన మూర్తి యింటినీ చూడగానే సూర్యాంబ మతిపోయింది. మూర్తిని వొదులుకున్న పశ్చాత్తాపం పొంగి పొర్లి ఉక్కిరి బిక్కిరి చేసింది. అవాకులూ చవాకులూ వాగటం మొదలుపెట్టింది.

ఇంత అల్పత్వం ఎలా వచ్చిందా అని తను మాట్లాడినదంతా తల్చుకుని తెల్లబోవటం మొదలుపెట్టింది రాను రాను.

నిజానికి సూర్యాంబకీ - ఆవిడ భర్తకీ దారుణమైన స్పర్థలేమీ లేవు. ఇరుకుగదుల అద్దె కొంపల్లో సూర్యాంబ ఎంతో తృప్తిగా-సుఖంగా గడిపిన రోజులున్నాయి. పిల్లల్ని చూసుకుని మురిసిపోతూ భర్తని ఆదరించి సేదదీర్చిన రోజులున్నాయి. ఎప్పుడో కాదు. ఇప్పుడుకూడా మనసులో అదంతా తచ్చాడుతోంది.

సూర్యానికి వరదలా దుఃఖం వచ్చేసింది.

"నిజంగా నాకు మతిపోయింది బావా!" అంది గబగబా కళ్లు తుడుచుకుంటూ.

మూర్తి మనస్సేదిటో బరువైపోయింది. నిజంగా సూర్యం చాలా బాధపడుతోంది. ఓదార్చటానికికూడా మనస్కరించలేదు మూర్తికి. సూర్యం తనకోసమే బాధపడుతోంది.

ఇద్దరూ నిశ్శబ్దంగా నుంచున్నారు.

మాటలమధ్య రెండు బస్సులు దాటిపోగా మూడోదాంట్లో ఎక్కింది సూర్యాంబ.

"మళ్లా వస్తాలే. ఇంకా వుంటారుగా ఆస్పత్రిలో," అన్నాడు మూర్తి.

"ఆవిడ ఉంటారుగానీ— నేను వెళ్ళిపోతాను. యింటిదగ్గిర.... ఎలా వున్నారో!"

"అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూండు."

"ఊఁ" కొట్టింది-బస్సు కదిలింది.

* * *

మూర్తి దిగులుపడుతోన్నవాడిలా యింటికి వచ్చాడు. విశాల సూర్యాంబ గురించి అడిగింది. చెప్పాడు.

గదిలోకిపోయి పడుకున్నాడు.

విశాల దీపాలు వేసి పిల్లలకి అన్నాలు పెట్టి మూర్తి దగ్గిరికి వెళ్ళి కూర్చుంది, "వేళకాని వేళ నిద్రేవిటి?... తలనొప్పిగా వుందా?...." అంది మూర్తి నుదురుమీద చెయ్యి వేస్తూ.

"ఊహూ! వూరికే పడుకున్నాను."

"అలా వున్నారేం?"

"ఏం లేదు. సూర్యం గురించి ఆలోచిస్తోంటే జాలేస్తోంది."

"ఏం? ఏమైంది?"

"పిచ్చిదానిలా ఏడ్చేసింది. మనిషి చాలా పాడైపోయింది. సంసారం సరి అయినది కాక బొత్తిగా విసిగిపోయింది."

"................"

సూర్యం జీవితం యిలా అయిపోవటానికి నేనూ చాలా వరకు కారణమే నేమో విశాలా!"

విశాల తెల్లబోయింది.

"పెద్దవాళ్లు మూర్ఖపు పట్టుపట్టారని—నేను కూడా నిర్లక్ష్యంగా వూరుకున్నాను అంతా సవ్యంగా జరిగితే సూర్యం సుఖపడేదే కదూ?"

ఘ్రమాన్పడిపోయింది విశాల.

"సూర్యం కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. తెలిసి చేసినా తెలియకుండా చేసినా నా మూలంగా అన్యాయం జరిగింది. నే నెంత సుఖపడుతున్నా ఏం సంతోషం?"

విశాల భరించలేకపోతూంది. "ఆవిణ్ణి చేసుకోలేదని మీకు పశ్చాత్తాపంగా వుందా....?" అంది మనస్సు బిగపట్టుకుంటూ.

"పశ్చాత్తాపం కాదు, సూర్యం కొంచెం సుఖపడే దేమోనని ..."

ఎలా సుఖపడేది? అర్థంకాలేదు విశాలకి....

"సుఖపడేది నిజమే కానీ అప్పుడు మీ జీవితం ఎలా వుండేదో ఆలోచించారా?" ఆ మాట అడగటం విశాలకు సుతారామూ యిష్టంలేదు. ఏదో వేదన అప్రయత్నంగా అడిగించింది.

మూర్తి మాట్లాడలేదు.

విశాల లేచి నించుంది ..."మీ రిప్పుడు సుఖంగా వున్నానని మీ నోటితోనే అన్నారు. సూర్యాంబకోసం మీ జీవితం యిలా లేకపోయినా ఫర్వాలేదనిపిస్తోంది మీకు. నిజంగా సూర్యాంబ అదృష్టవంతురాలు" విశాల మొహం ఎప్పుడూ లేనంతగా వాడిపోయింది.

మూర్తి తెల్లబోయాడు.

విశాల నెమ్మదిగా వెళ్ళిపోయింది.

ఆ రాత్రి విశాల దాంపత్య జీవితంలో చాలా కొత్తదిగా వుంది. విశాలా మూర్తీ ఒకరి మొహం ఒకరు చూసుకోవటానికి సిగ్గుపడిపోయారు.

మూర్తి మాటలు పదే పదే విశాల చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఎనిమిదేళ్ళు కాపరంచేసి, ఇద్దరు పిల్లల్ని కని, ఇంత నిశ్చింతగా బ్రతుకుతూ, ఈ భార్యా ఈ పిల్లలూ, వీళ్ళతో జీవితం లేకపోయినా ఫర్వాలేదనుకున్న భర్త విశాలని ఎన్నడూ ఎరగనంత సత్తువరాల్ని చేశాడు. తన భర్త మనసులో తనకున్న స్థానం ఇంత అల్పమైనదా? ఎక్కడో దూరంగావున్న సూర్యాంబకన్నా అతనితో కష్టసుఖాలు పంచుకుంటూ కాపరం చేస్తోన్న తన ప్రత్యేకత ఆధిక్యత ఏమీ లేవా?"

మూర్తి మాటలు ఆకళింపౌతోన్న కొద్దీ విశాలకి పదే పదే వెంక ట్రత్నం గుర్తొచ్చాడు.

అతను విశాలకు బావ. వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసి ఆస్తిపాస్తులన్నీ కలగలుపుకుంటే బావుండునని పెద్దవాళ్లనుకున్నారు.

విశాల ఒప్పుకోలేదు. వెంకట్రత్నంలో చురుకు పాలెక్కువ. ఏదీ లక్ష్యపెట్టని స్వభావం. డబ్బు ఖర్చు చేస్తూ జల్సాగా తిరుగుతూండేవాడు. మితిమీరిన దుర్వ్యసనాలూ-దుర్గుణాలూ లేకపోయినా అతనితో పెళ్ళి లాటరీ అవుతుందేమోనని విశాల భయం. జీవితమంతా అలాంటి వ్యక్తిని నమ్ము కోటానికి సిద్ధపడటం.... సాహసం కాదు.... మూర్ఖత్వమేనని విశాల ఉద్దేశం అంతకు మించి బావ మీద విశాల కేమీ అసహ్యం లేదు. అతనంటే అభి మానం వుంది. అది వెల్లడించే చనువుకూడా వుంది.

విశాల తిరస్కారం తెలిసీ తెలియగానే వెంకట్రత్నం విశాల దగ్గిరికి గాలి దుమారంగా వచ్చాడు—"ఏం? ఏవో పెద్ద కబుర్లు చెప్తున్నావుట" అన్నాడు విశాలని మింగేసేలా చూస్తూ.

"ఉత్తది బావా! నాకేం తెలీదు" అంది విశాల నవ్వుతూ.

వాదం పెట్టుకున్నాడు వెంకట్రత్నం — "అసలు నీ ఉద్దేశ్యం ఏమిటి?" అన్నాడు బల్ల గుద్ది.

"అదిగో! అందుకే నాకు భయం. పెళ్ళి చేసుకుంటే ఆ చేతి విసురు నా మీదికే వస్తుంది."

"ఛ! అదేవిటి విశాలా!" చిన్నబోయాడు. వెంకట్రత్నం—"నేనంత దుర్మార్గుడినా?"

"బావగారికి కోపం వచ్చింది గానీ—కుక్కతోక పట్టుకు గోదావ రీదితే అది ఎక్కడ తేలుస్తుందో, ఎక్కడ ముంచుతుందో ఎలా తెలుస్తుంది?"

విశాల హాస్యాల్లో ముంచి అసలు సంగతి ఎటూ తేల్చలేదు.

వెంకటరత్నం మనసు కష్టపెట్టుకుని వెళ్ళిపోయాడు. తర్వాత బావా మరదళ్ళ పెళ్ళి ప్రసక్తి ఎవ్వరూ తేలేదు.

తర్వాత విశాలకి మూర్తితో పెళ్ళయింది. విశాల తిరస్కారంతో వెంకట్రత్నంలో "చిన్నతనం" సిగ్గుపడింది. "నే నెందుకు విశాలకి నచ్చ లేదు?" అన్న ప్రశ్న అతన్ని వేధించింది. అతనికి తోచిన జవాబు అతని మనసుకు కూడా సమంజసంగా తోచింది. ఎంత డబ్బుంటే మాత్రం మంచి బాటలో నడవనివాణ్ణి ఆడపిల్ల ఎలా నమ్ముతుంది? ఈ మగవాడు దొరకటం నా అదృష్టం! అని గర్వపడాలి ఆడది. ఏదీ? తనని చూసి గర్వపడటాని కేముంది? క్లబ్బులూ, పేకాటలూ, గుర్రప్పందేలూ, షికార్లూ, విహారాలూ వాటన్నిటినీ కప్పెట్టే డబ్బుంది. అది అక్కర్లేదు విశాలకి. విశాల తనకి దక్కలేదు.

విశాలని వెంకట్రత్నం సినిమాల్లోలాగా ప్రేమించి బాధపడటంలేదు. విశాలని తలదన్నే సౌందర్యరాశిని తెచ్చుకుని నిక్షేపంలా బ్రతకగలడు. కానీ విశాల విలువ వెంకట్రత్నం అంతరంగానికి తెలుసు. విశాల చేజారి పోయాక ఆ విలువ వెయ్యిరెట్లు పెరిగింది.

"బావా! నువ్వింత మంచిమార్గంలో పడతావనుకోలేదు. నిన్ను వద్దను కుని నేనే తొందరపడ్డాను" అని విశాల ఒక్కసారైనా అంటే గాని వెంక ట్రత్నానికి తృప్తిలేదు.

వెంకట్రత్నం మనసు పరివర్తనకేసి పరుగులు తీసింది. పాత అల వాట్లు చాలావరకు మానుకున్నాడు. చూసేవాళ్ళకి తనలో మంచితనం కన పడాలి. తనమీద నమ్మకం కుదరాలి. తను సంఘంలో ఒక మర్యాదస్థుడిగా నిలబడాలి. అందరికీ దక్కే గౌరవం తనకి కూడా దక్కాలి-అన్న కాంక్ష వెంకట్రత్నాన్ని చాలా అభివృద్ధిలోకి తెచ్చింది. వున్నత శిఖరాల కెత్తింది. డబ్బులోనూ, పలుకుబడిలోనూ, మంచితనంలోనూ, హోదాలోనూ-వెంక ట్రత్నం విశాల భర్తని జయించాడు.

లక్షరూపాయల కట్నం కాలదన్నుకుని మనసుకి నచ్చిన పిల్లని పెళ్ళి చేసుకున్నాడు. పిల్లల్ని కంటున్నాడు.

"విశాలా! నేను చాలా మారిపోయానేవ్. ఎంత మంచి వాణ్ణయ్యా ననుకున్నావ్?" అన్నాడోసారి హాస్యధోరణితో.

విశాల మనసారా నవ్వి—"నువ్వు మారాలనే నేను పెళ్లాడనన్నాను. చూశావా ఇదంతా నా గొప్పే!" అంది.

"అంతేగాని, నేను నీకు నచ్చేంత మంచివాడినైపోతానని తెలిసినా నన్ను పెళ్ళి చేసుకునేదానివి కాదన్నమాట."

"ఛస్తే చేసుకోను, చేసుకోకూడదని ఖచ్చితంగా నిర్ణయించుకున్నాను. ఒక మంచిపని చేస్తున్నానని నమ్మి చేశాను. దాని ఫలితం ఎలా వున్నా అనుభవించాలనే తయారయ్యాను. నిన్ను కాదని నేను పెళ్ళి చేసుకున్న మనిషి భవిష్యత్తులో దురలవాట్లకి బానిసై నా బ్రతుకు సర్వనాశనం అయిపోయినా నిన్ను చేసుకోనందుకు నేను పశ్చాత్తాపపడను. అది చాలా నీచం. అప్పుడు నేను మంచిదనుకున్నది ఇప్పుడు చెడ్డదనుకోవటం మూర్ఖత్వం కదూ?" అంది విశాల.

"నన్ను పెళ్ళి చేసుకుంటే చేతి విసురు చూపిస్తానని అభాండాలు వేశావుకదా? పోనీ మాలవిణ్ణి అడుగు. ఈ ఐదారేళ్ళలోనూ అలాంటి తప్పుడు పనేదైనా చేశానేమో!" అన్నాడు వెంకటరత్నం మంచి బాలుడిలా.

"తిరిగి తంతుందని నీకూ తెలుసు." నవ్వింది విశాల. వాళ్ళిద్దరిదీ అనుకూలమైన దాంపత్యం అని విశాలకి తెలుసు.

"విశాలా!"

భుజం మీద స్పర్శకి తలెత్తింది విశాల.

మూర్తి మొహంకేసి వుదాసీనంగా చూసింది.

"ఎందుకలా కూచున్నావు? దీపం వెలుగుతోంటే ఏమైనా చదువు కుంటున్నావేమో అనుకున్నాను. పన్నెండు దాటింది. పండుకుందుగాని రా!" మృదువుగా వున్నాయి మూర్తి మాటలు.

విశాల మౌనంగా లేచింది.

గదిలోకి వెళ్ళి పడుకుంది.

దగ్గిర కూచున్నాడు మూర్తి.

రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"విశాలా! నీ మనసు చాలా కష్టపెట్టాను."

"............"

"విశాలా! నీ మనసులో ఏమీ పెట్టుకోవద్దు. నిజంగా.... మనస్ఫూర్తిగా చెప్తున్నాను. సూర్యానికీ నాకూ పెళ్ళయితే నా జీవితం యెలా వుండేదో వేరే ఆలోచించక్కర్లేదు. అప్పుడు నేను మామూలు గుమాస్తానే నాకున్న అలవాట్లూ, ఖర్చులూ నాకు వున్నాయి. సూర్యాన్ని పెళ్ళి చేసుకుంటే మాత్రం మానేవాణ్ణా? అసలు మా యిద్దరికీ పొత్తు కుదిరేది కాదేమో! వాళ్ళ నాన్నకీ, మా నాన్నకీ బద్ధవైరం. ఎవరి తండ్రిని వాళ్ల సమర్థించుకుంటాంకదా! పంతాలతో, పౌరుషాలతో ఇద్దరి బతుకులూ అతక్కుండా పోయేవేమో!

ఈ నాడు నేనింత మంచి స్థితిలో వున్నానని సూర్యం నన్నుచూసి మోజుపడిందిగానీ, నేనూ దాని మొగుడులాంటి వాణ్ణే అయితే నన్ను గురించికూడా అంత చులకనగానే మాట్లాడేది. దానికి కావలసింది డబ్బు, హోదా- అంతే. అదికూడా ఒక పెద్ద ఉద్యోగస్థుడి పెళ్ళాం అయితే నా పేరైనా తల్చుకునేది కాదేమో! ఏమో ఏవిటీ? నిజంగానే నా మొహం చూసేది కాదు - పైగా నన్ను మించినవాణ్ణి చేసుకున్నాననే గర్వంతో విర్రవీగేది.

సూర్యాన్ని నేనే చేసుకుంటే ఇప్పటికన్నా సుఖపడేదేమో అనుకున్నానుగానీ అదంతా వుత్తది. నిజంగా ఇదంతా ఆలోచిస్తే నా మనస్సు

తేలికపడింది. నీ దగ్గిర ఎంత తొందరపాటుగా మాట్లాడానో అర్థమైంది. అదంతా మర్చిపో విశాలా!" గబగబా చెప్పుకుపోయాడు మూర్తి.

విశాల వింటూ వింటూ నిశ్శబ్దంగా పడుకుంది.

"సూర్యం నా మేనత్తకూతురుకాబట్టి, అది పేదరికంతో బాధపడు తోందని జాలిగానే వుంది. అంతేగానీ, దానికి నేనేదో అన్యాయం చేశా ననుకోవటం మూర్ఖత్వం. నాకు నేను అన్యాయం చేసుకోటానికి తయా రయ్యాను పిచ్చివాడిలాగ."

విశాల మనస్సేదో మంత్రం పెట్టినట్టు తేలికైంది.

"విశాలా! నువ్వు నాకు దొరకటం నా అదృష్టం ముఖ్యప్రీతికంటున్నా ననుకోకు. ఇప్పుడు నేనెంతో హాయిగా వున్నాను. నేను తెలిసి యెవ్వరికీ అన్యాయం చెయ్యలేను. అందుకే నేనింత సుఖపడుతున్నాను. నన్ను గురించి నువ్వు యెలా అనుకున్నా సరే! నా మనసులో మాటలన్నీ చెప్పేశాను." చేసిన తప్పు ఒప్పుకున్న చంటివాడిలా, మాట్లాడటం మానేసి పడుకుని నిద్రపోయాడు మూర్తి.

విశాలకికూడా గాఢంగా నిద్రపట్టింది. రెండు రోజుల తర్వాత సూర్యాంబ దగ్గిర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది విశాల పేర. క్షేమ సమాచా రాలతోపాటు యెందుకో పశ్చాత్తాపం వెల్లడిస్తూ క్షమాపణ అర్థించింది.

"పార్వతీ పరమేశ్వరుల్లాగ మీరిద్దరూ ఎంతో అన్యోన్యంగా సుఖంగా బ్రతుకుతున్నారు - మిమ్మల్ని తల్చుకుంటోంటే నా కెంతో ఆనందంగా వుంది.

ఆరోజు...మీయింట్లో...నాపిచ్చి పిచ్చి మాటలవల్ల మిమ్మల్ని చాలా చికాకు పెట్టాను.... అదంతా తల్చుకుంటోంటే సిగ్గుతో చితికిపోతున్నాను. మీరు నమ్ముతానంటే ఒక్కమాట చెప్పుకుంటాను. నేను మీకు కనిపించి నంత నీచురాల్ని కాను. మంచిచెడ్డల విచక్షణా జ్ఞానంలేని మూర్ఖురాల్ని

కాను, నాగురించి యెప్పటికైనా మీకో మంచి భావం ఏర్పడితే అదే నాకు పదివేలు. నేనూ - నా భర్తా-నా పిల్లలూ అందరం సుఖంగావున్నాం. సుఖదుఃఖాలకు అంతరాలుంటాయి. కానీ హద్దులుండవు. నా పేద సంసారంలో నేనో మహారాణీనని నా కెప్పుడూ తెలుసు. అయినా....ఆరోజు.... మీరు నన్ను క్షమిస్తారనే ఆశతో—

సూర్యాంబ.

విశాల ఆశ్చర్యపోతూ వుత్తరం పదే పదే చదివింది.

సుఖంగా ప్రశాంతంగా సాగుతోన్న జీవితాలలో అపశ్రుతుల్లాంటి ఘట్టాలెందుకు సంభవిస్తాయో! తెలీదు మరి.